ప్రజాశక్తి
శనివారం 16 డిసెంబర్ 2023 5
అనంతపురం

బొమ్మనహాల్ మండలంలో అంగన్‌వాడీ కేంద్రంకువేసిన తాళాన్ని సుత్తితో పగులగొట్టి తెరుస్తున్న అధికారులు

సడలని సంకల్పం..!

- ఉధృతంగా అంగన్‌వాడీల సమ్మె
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4వ రోజు నిరసన
- పలుచోట్ల భిక్షాటన
- సమ్మెను నీరుగార్చేందుకు ప్రభుత్వం యత్నం
- శుక్రవారం నాడూ కొనసాగిన సమ్మెపై 'సమ్మెట'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మె ఉధృతమైంది. అధికారుల బెదిరింపులు, అణచివేతలను ఎదిరిస్తూ సడలని సంకల్పంతో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలో పెద్దఎత్తున అంగన్‌వాడీలు కదం తొక్కారు. నల్లవస్త్రాలు ధరించి వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. పలు చోట్ల బిక్షాటన చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచే అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు నిరసనలు చేపట్టారు. సమ్మెను విఫలం చేయడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలనూ ముమ్మరం చేసింది. సచివాలయాల్లోని హెల్త్ సెక్రటరీల ద్వారా బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించే కుట్రలు చేశారు. దీనిని సిఐటియు నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతిఘటించడంతో కేంద్రాలను పూర్తి స్థాయిలో అధికారులు ప్రారంభించ లేకపోయారు.

పుట్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ముందు బాడుగ కట్టండి

అనంతపురం నగరంలోని నిర్మలానంద నగర్‌లో బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించేందుకు వెళ్లిన సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు కేంద్రానికి తాళం వేశారు. దీన్ని ప్రారంభించేందుకు సచివాలయ సిబ్బంది వెళ్లారు. ఈ సమయంలో ఐదు నెలలుగా బాడుగ చెల్లించలేదు.. ముందుగా బాడుగ కట్టి తాళాలు తెరవాలని భవన యజమాని చెప్పడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

లబ్ధిదారులకు అవగాహన

లబ్ధిదారులకు అవగాహన కల్పించి మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని అంగన్‌వాడీలు చేపడుతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే అంగన్‌వాడీలకు ఇంటింటితోనూ పరిచయముంటుంది. వీరు తమ సమ్మెకు మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. గుంతకల్లులో నిరసన చేపట్టిన అంగన్‌వాడీలకు మద్దతుగా లబ్ధిదారులు పాల్గొని సమ్మెకు అండగా నిలిచారు. ప్రభుత్వం తక్షణం వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. శనివారం నుంచి అంగన్‌వాడీలు లబ్ధిదారుల వద్దకెళ్లి తమ సమస్యలను తెలియజేసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

వార్తలు 6లో

అనంతలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయడంలో భాగంగా వివిధ రూపాల్లో అంగన్‌వాడీలు ఆందోళనలు చేస్తున్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో నల్లవస్త్రాలు ధరించి చేతిలో బొచ్చెలు పట్టుకుని భిక్షాటన చేశారు. వీరికి సిపిఎం జిల్లా కార్యదర్శి

జోలెపట్టి..బిచ్చమెత్తి..!

వి.రాంభూపాల్, సిఐటియు, ఎస్ఎఫ్‌తో పాటు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. హిందూపురంలోనూ ఇదే రకంగా నిరసన చేపట్టారు. రోడ్డుపై బిచ్చగాడితో అంగన్‌వాడీలు భిక్ష అడగటం అందరినీ ఆకర్షించింది. అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన ప్రదర్శనలు సాగాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుండా సమ్మెను విఫలం చేయాలనుకున్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలను చేశారు.

సమ్మెపై 'సమ్మెట'

తాడిపత్రిలో తాళం పగులగొడుతున్న అధికారులు

అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడంలో భాగంగా ప్రభుత్వ సూచనల మేరకు అధికారులు అన్ని అస్త్రాలను బెదిరిస్తున్నారు. విధులకు రాకుంటే ఉద్యోగాలు పోతాయంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇక సమ్మె సందర్భంగా మూసిన అంగన్‌వాడీ కేంద్రాలను దొడ్డిదారిన తెరిచేందుకు సిద్ధం అవుతున్నారు. ఏకంగా తాళాలు పగులగొట్టి వాటిని తెరస్తున్నారు. సంబంధిత అంగన్‌వాడీ సిబ్బంది లేకుండా తాళాలు పగులగొట్టడం నేరమని తెలిసినా కూడా అధికారులు దగ్గరుండి మరీ ఈ పనులు చేయిస్తున్నారు. అనంతపురం జిల్లాలో గుమ్మఘట్ట, తాడిపత్రి, నార్పల, అనంతపురం, బొమ్మనహాల్, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో బీగాలను పగులగొట్టారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో రొద్దం, గాండ్లపెంట మండలాల్లో తాళాలు పగులగొట్టారు. సోమందేపల్లి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడంపై సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ తండ్రికి ఎంత కష్టమొచ్చిందో

ముగ్గురు పిల్లలకు క్రిమిసంహారక మందు తాపి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆ తండ్రికి ఎంత కష్టమొచ్చిందో ముక్కుపచ్చలారని ముగ్గురు కూతుళ్లకు కూల్‌డ్రింక్‌లో క్రిమిసంహారక మందు కలిపి తాగించి తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాయదుర్గం పట్టణ శివారులోని సిద్దులకొండ సమీపంలో చోటుచేసుకుంది. ఆ నలుగురూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చిన్నకుమార్తె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

శెట్టూరు మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన గంగాధర్‌కు గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన గీతమ్మతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అతడు బేల్దారిగా, భార్య కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. వీరికి గంగోత్రి(8), కావేరి(6), వైష్ణవి(3) సంతానం. కావేరి పూలకుంటలో అవ్వ వద్ద ఉంటూ 1వ తరగతి చదువుతోంది.

గంగాధర్ మధ్యాహ్నం పనికి వెళ్లిన భార్య వద్దకు వెళ్లి వైష్ణవిని, గొల్లపల్లి పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న గంగోత్రిని, పూలకుంట పాఠశాలలో ఉన్న కావేరిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని రాయదుర్గం చేరుకున్నాడు. తర్వాత సిద్దులకొండ వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు కలిపిన కూల్ డ్రింక్స్‌ని వారి చేత తాగించి తానూ తాగాడు.

పాఠశాల నుంచి మనవరాలు ఇంటికి రాకపోవడంతో గంగాధర్ అత్త గీతమ్మకు ఫోన్ చేసి ఆరా తీసింది. దీంతో భార్య గంగాధర్‌కు ఫోన్ చేయగా సిద్దులకొండ వద్ద ఉన్నట్లు తెలపడంతో వారు అక్కడికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న నలుగురినీ రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. చిన్న కుమార్తె వైష్ణవి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కలెక్టరేట్ ఏఓ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఏఓ శ్రీధర్‌కు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీదర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యా పర్యవేక్షణలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 84 జిఓను జారీ చేసిందన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని భావించామన్నారు. అయితే మున్సిపల్ ఉపాధ్యాయుల డిడిఓ పవర్స్‌తో పాటు కొన్ని సమస్యలు పరిష్కారయ్యాయని తెలిపారు. అయితే ప్రధానమైన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. బదిలీలు, ప్రమోషన్‌లు తక్షణమే నిర్వహించాలన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యంకల్పించాలన్నారు. పాఠశాలల అన్నింటికి బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. భవనాల అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలన్నారు. అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, కోశాధికారి రాఘవేంద్ర, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగేంద్ర, రాప్తాడు మండల అధ్యక్షులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విప్ 'కాపు' దౌర్జన్యాలపై విచారించాలి

ఎస్పీకి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు 'కాలవ' వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయదుర్గం నియోజకవర్గంలో విప్ కాపు రామచంద్రారెడ్డి చేస్తున్న దౌర్జన్యాలపై విచారణ చేపట్టాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు కోరారు. ఈమేరకు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు రామచంద్రారెడ్డి ప్రమేయంతో జరిగిన పలు నేరాల్లో అసలు నిందితులను అరెస్టు చేయడం లేదన్నారు. నాలుగున్నరేళ్లలో వినీతి అక్రమాలను ప్రశ్నించిన వారిపై పాశవికంగా దాడులు చేయించాడని వివరించారు. చట్టబద్ధంగా వ్యాపారాలు చేసుకునే వారిని బెదిరించి, వాటిని బలవంతంగా గుంజుకోవాలని కుట్రలు సాగించాడన్నారు. ప్రజలిచ్చిన అధికారాన్ని తన అక్రమ సంపాదనకు దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. ప్రశాంతమైన రాయదుర్గం ప్రాంతంలో అలజడులు చేయించి వ్యాపారులను బెదిరించి భయానక వాతావరణాన్ని సృష్టించాడన్నారు. సీనియర్ జర్నలిస్టు ఆవుల మనోహర్‌పై దాడి చేయించాడన్నారు. బొమ్మనహాల్ మండలం, నేమకల్లు కొండ ఎమ్మెల్యే కాపు దోపిడీకి కేంద్రంగా మారిందన్నారు. అనుమతుల్లేకుండా పెద్దఎత్తున బ్లాస్టింగులు జరుపుతూ, క్వారీని నడుపుతున్నాడని తెలిపారు. ఓ మహిళ నిర్వహిస్తున్న క్రషరును దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నించాడన్నారు. రాయదుర్గం ప్రాంతంలో శాంతిభద్రతలకు పెను ప్రమాదంగా మారాడని, అతని ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయంతో జరిగిన నేరాలపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రీ.. మాటనిలుపుకో..!

- ముక్తకంఠంతో నినదించిన ఆశాలు
- ముగిసిన 36 గంటల వంటా వార్పు దీక్షలు
- పెద్ద ఎత్తున హాజరైన ఆశా కార్యకర్తలు
- హామీలు అమలు చేయకుంటే పోరాటమే..!
- జిల్లా స్థాయి సమస్యలను పరిష్కరిస్తామని డిఐఒ యుగంధర్ హామీ

అనంతపురంలో నిరసన తెలుపుతున్న ఆశాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాదయాత్ర సందర్భంగా ఆశా కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపుకోవాలని ఆశా కార్యకర్తలు నినదించారు. ఎన్నికల హామీల అమలు, సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 36 గంటల వంటా వార్పు నిరసన దీక్షలు శుక్రవారం ముగిశాయి. ఆశా కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి అధ్యక్షతన రెండు రోజులు పాటు నిర్వహించిన దీక్షలకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆశాలు పాల్గొని ప్రభుత్వానికి నిరసనను తెలియజేశారు. శిబిరం వద్దనే వంట వార్పుతో సహపక్తి భోజనాలు చేశారు. గురువారం రాత్రి తీవ్రమైన చలిలో సైతం ఆశాలు అక్కడే నిద్రించారు. శుక్రవారం దీక్షల ముగింపు సందర్భంగా పలువురు హాజరై మద్దతు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, జనసేన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, సిపిఎం నగర కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, వి.రామిరెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి టి.గోపాల్, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, మెడికల్ రెప్స్ యూనియన్ సురేంద్ర, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పోతులయ్య తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఆశా కార్మికులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారితో అదనపు పనులు చేయిస్తూ పనిభారం మోపుతోందన్నారు. వీరు పని ఒత్తిడికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇచ్చేందుకు మాత్రం ప్రభుత్వం ముందుకు రాకపోవడం అన్యాయంగా ఉందన్నారు. జనసేన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ మొండి ప్రభుత్వానికి పోరాటాలతోనే బుద్ధి చెప్పాలన్నారు. ఆశాల పోరాటాలకు జనసేన అండగా ఉంటుందన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ఆశాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఆశాలతో ఫీల్డ్ వర్క్ మాత్రమే చేయించాలన్నారు. అలా కాదని, పిహెచ్‌సి, వీలేజ్ క్లీనిక్ శుభ్రం చేయించడం సరికాదన్నారు. స్థాయిలో చేయించాల్సిన పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాలతి, కోశాధికారి భారతి, వరలక్ష్మి, సుజాత, గాయత్రి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి

డిఐఒ స్పందన

ఆశాల దీక్షా శిబిరం వద్దకు డిఐఒ యుగంధర్ శుక్రవారం నాడు హాజరై వారితో మాట్లాడారు. జిల్లా స్థాయిలోని సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. విలేజ్ క్లీనిక్‌లు శుభ్రం చేసే విధులు ఆశాల పరిధిలో లేవన్నారు. అలా ఎవరైనా చేయిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీల్డ్‌వర్క్ మాత్రమే చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారించాల్సిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

సమస్యల పరిష్కారంపై ఆశాలతో మాట్లాడుతున్న డిఐఒ యుగంధర్

రైతు పక్షపాతి సిఎం జగన్ : ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపంలో 160 మంది పేదలకు అసైన్‌మెంట్ భూ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమిలేని నిరుపేద కుటుంబాలకు భూపంపిణీ చేసి సిఎం జగన్ మరోసారి రైతుపక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. 20 సంవత్సరాలు సాగులో ఉన్న రైతులకు భూ పట్టాలు పంపిణీ చేయడంతోపాటు వారికి క్రయ విక్రయాలు చేసుకునే అవకాశం కల్పించారనానరు. అలాగే చుక్కల భూముల సమస్యలు లేకుండా రీసర్వే చేసి రైతులకు పాస్ పుస్తకాలు అందజేస్తున్నారన్నారు. అనంతరం అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు రామిరెడ్డి, జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యులు వేమనాథరెడ్డి, మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాయకులు రవిప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, చాగల్లు సూర్యనారాయణ, జనార్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, నారాయణప్ప, సింగనగుట్టపల్లి లక్ష్మిరెడ్డి, తహశీల్దార్లు లక్ష్మీకాంతనాయక్, అలెగ్జాండర్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేద్దామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం టిడిపి అర్బన్ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న విశాఖపట్నంలో నిర్వహించే యువగళం ముగింపు సభను పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ ఇది బాబు గ్యారెంటీ కార్యక్రమంలో రాష్ట్రంలో అనంతపురం నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలన్నారు. ప్రజల మద్దతు కూడగట్టి టిడిపిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పరిశీలకుడు రమణారెడ్డి, టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్‌గౌడ్, సీనియర్ మైనారిటీ నాయకులు సాలార్ భాషా, తలారి ఆదినారాయణ, దాసరి శ్రీధర్, గాజుల అదెన్న, బంగి నాగ, మార్కెట్ మహేష్, వన్నూర్, ముక్తియార్, పోతుల లక్ష్మీనరసింహులు, జేయం బాషా, గోపాల్‌గౌడ్, రాజారావు, సురేంద్ర, వంకదారు వెంకటకృష్ణ, సైపుద్దీన్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, గుర్రం నాగభూషణ, తెలుగు మహిళలు స్వప్న, విజయ శ్రీ రెడ్డి, సంగా తేజస్విని, సరళ, దలవాయి రమాదేవి, శరీనా, హసీనా, సుజాత, జానకి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

డిసెంబర్ ఆఖరి వరకూ వేరుశనగ సాగు చేయవచ్చు

చర్చా కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

నీటి పారుదల ఉన్న రైతులు డిసెంబర్ ఆఖరి వరకూ వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించారు. శుక్రవారం మండలంలోని రేకులకుంట ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమంలో ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన పంటపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చర్చించారు. ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ చీనీ, నిమ్మ, వేరుశనగలో సుక్ష్మ పోషకాల లోపాన్ని అధిగమించేందుకు సేంద్రీయ ఎరువులను వాడాలని సూచించారు. రేకులకుంట పరిశోధన స్థానం అధిపతి బి.సహదేవరెడ్డి మాట్లాడుతూ రబీ వేరుశనగ కొన్ని ప్రాంతాల్లో శాకీయ దశ నుంచి పూత దశలో ఉందన్నారు. నల్లరేగడి నేలల్లో అధిక తేమ ఉన్నప్పుడు ఇనుపధాతు లోపం రావటానికి అవకాశం ఉందన్నారు. తద్వారా లేత ఆకులు పసుపు పచ్చగా, తర్వాత తెలుపు రంగుకు మారుతాయన్నారు. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరానికి 1 కిలో అన్నబేది (5 గ్రా/లీటరు నీటికి), 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అలాగే పంట పొలంలో, గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, అధికారులు



గుమ్మఘట్టలో అంగన్వాడీ సెంటర్ తాళం పగులగొడుతున్న అధికారులు

ప్రభుత్వం స్పందించేంత వరకూ సమ్మె

జిల్లావ్యాప్తంగా కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళన-పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వానికి విన్నవించారు. చేస్తాం.. చూస్తాం.. అంటూ కాలం నెట్టుకొస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మౌనం వహిస్తున్నారు. హక్కుల కోసం ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు చేస్తుంటే బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలు తాలాలు పగులగొట్టి ప్రారంభిస్తున్నారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య. సమస్యలు పరిష్కరించని ఈ ప్రభుత్వానికి పతనం తప్పదు' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వీడాలంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. శిబిరం నుంచి కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. వాహనదారులు, చిరు వ్యాపారులు, ప్రయాణికులతో భిక్షాటన చేసి వారి మద్దతు కోరారు. కలెక్టరేట్ ప్రధానగేటు ఎదుట నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరిస్తారా.? అడుక్కొని సెంటర్‌లు నిర్వహిం చమంటారా.? అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, జనసేన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి. నాయుడు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, గోపాల్, ముత్తుజా, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు గిరి, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తదతరులు మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. తెలంగాణా కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చిందే సిఎం జగన్ అయినప్పుడు దానిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు కార్మిక సంఘాల నేతలు పిలిచి ఆర్థికేతర అంశాలపై మాత్రమే చర్చించాలంటూ మెలిక పెట్టడం మభ్యపెట్టడం కాదాన్నారు. జగన్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని బెదిరిస్తూ సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తాలాలు పగులగొట్టి దౌర్జన్యపూరితంగా అధికారులు వ్యవహరించడం ఎంత వరకు సమంజసం అని నిలదీశారు. అరెస్టులు, బెదిరింపులతో ఉద్యమాలను ఆప లేరన్న సత్యాన్ని ప్రభుత్వం పెద్దలు తెలుసుకోవాలని హితవు పలికారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. గ్రాట్యూటీ, కనీస వేతనాలు ఇచ్చి తీరాలన్నారు. జనసేన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు జనసేన సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు విజయభారతి, నాయకులు నక్షత్ర, అరీఫా, హరిప్రియ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో అంగనవాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ అంగన్వాడీలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, శింగనమల ప్రాజెక్టు కార్యదర్శి కాత్యాయని, సిఐటియు నాయకులు సి.నాగేంద్ర, నెట్టికంటయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు లింగమయ్య. పుల్లయ్య, తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల సెక్టార్ లీడర్లు విమల, సుజాత, వెంకటలక్ష్మి, రత్నమ్మ, లక్ష్మీదేవి, లలిత, గీత, తదితరులు పాల్గొన్నారు. అలాగే సమ్మెకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో టిడిపి నాయకులు పసుపుల హనుమంతురెడ్డి, పొడవాళ్ల రవీంద్ర, ఓబుళపతి, ఆది, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 4వ రోజు కొనసాగింది. ఇందులో భాగంగా మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు సంఘీభావాన్ని తెలిపారు. కాగా నాలుగు రోజులుగా మూతబడిన అంగన్వాడీ సెంటర్లకు అధికారులు తాళాలు బద్దలు కొట్టారు. సిపిఐ కాలనీలోని 3వ అంగన్వాడీ సెంటర్ తాళాలను మున్సిపల్ కమిషనర్ జి.రవి బద్దలు కొట్టారు. అనంతరం ఈ సెంటర్‌కు సంబంధం లేని పిల్లలను తీసుకొచ్చి ఫొటోలు దిగారు. అలాగే కొన్నిచోట్ల సిడిపిఒ సమక్షంలో స్థానిక సచివాలయ సిబ్బంది తాళాలు బద్దలు కొట్టే ప్రయత్నం చేయగా బాడుగ సెంటర్ల యజమానులు అడ్డుపడ్డారు.

నార్పల : ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు ఎక్కడికక్కడ అంగన్వాడీ కేంద్రాల తాళాలను బద్దలు కొట్టి సరుకుల వివరాలు, తదితర వాటి గురించి పంచనామా నిర్వహించి స్థానిక మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులకు అప్పజెప్పారు. పలుచోట్ల అధికారులను కొందరు అడ్డుకోగా తాము కేవలం ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కాగా ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా మండల కేంద్రంలో సిఐటియు నాయకులతో కలిసి అంగన్‌వాడీలు భిక్షాటన చశారు. ఇందులో భగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. వీరికి మద్దతుగా సిఐటియు మండల కార్యదర్శి కుళ్లాయప్ప పాల్గొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా అంగన్వాడీల దీక్షకు టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, మాజీ జడ్పిటిసి జాఫర్‌వలి, పిట్టు రంగారెడ్డి, చంద్రబాబునాయుడు, జనసేన నాయకులు రామకృష్ణ, భాస్కర్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్, రంగారెడ్డి, విరుపాక్షి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లోని తహాశీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 4వ రోజు కూడా కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీలు నల్లచీరలు కట్టుకుని నిరసన తెలుపుతూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. వీరి సమ్మెకు సిఐటియుతోపాటు యుటిఎఫ్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, కార్యవర్గ సభ్యులు నాగమణి, మంజుల, కృష్ణవేణి, సువర్ణమ్మ, వరలక్ష్మి, శ్వేతనాగు, శ్రీలక్ష్మి, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు రంగమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బెంజిమెన్, హమాలీ యూనియన్ నాయకులు చిన్న అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి

అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు శుక్రవారం ఉరవకొండలోని ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తే అధికారులు వెళ్లి సెంటర్ల తాళాలు పగులగొట్టడం ఎంత వరకూ సమంజసమని నిలదీశారు. ప్రభుత్వం తమను భయాందోళనకు గురి చేసే విధంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఆయా సెంటర్లలో ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహార సరుకులు, రికార్డులకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అంగన్వాడీ సెంటర్లను వైసిపి నాయకులు బలవంతంగా పగలుకొడుతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ అమృతరాజ్ అంగన్వాడీలు సమ్మెలో వెళ్లినప్పటి నుంచి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సెంటర్లు నడుపుతున్నామన్నారు. ఆ రోజుల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా అంగన్వాడీలు, హెల్పర్లకు ఎలాంటి బాధ్యత లేదని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

గుత్తి : అంగన్వాడీ, ఆయాలు శుక్రవారం గుత్తిలో వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె 4వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీలు భిక్షాటన చేశారు. అంగన్వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మల్లేష్, వి.నిర్మల, సిపిఎం మండల కార్యదర్శి బి. రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, సిపిఐ నాయకులు పూలమాబు, మహమ్మదా, తదితరులు సంఘీభావం వ్యక్తం చేశారు. శిబిరంలో నాయకులు బైఠాయించి మద్దతు పలికారు.

పామిడి : సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వంటావార్పు చేసి అక్కడే భోజనాలు చేశారు. సమ్మెకు సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు అనిమిరెడ్డి, రహీం మాట్లాడుతూ అంగన్వాడీలపై జగన్ ప్రభుత్వం దండయాత్ర చేస్తోందన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జయంతి, జె.ఎల్.నారాయణమ్మ, మహాలక్ష్మి, రామాంజనమ్మ, ప్రేమకుమారి, సిపిఎం కార్యదర్శి మల్లేష్, సిపిఐ నాయకులు నాగరాజు, కల్లూరు చౌడప్ప, గఫూర్, రాముడు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠ, నాయకులు ధనుంజయ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 4వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీలు నల్లచీరలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సమ్మె చేస్తే పట్టించుకోకపోగా అంగన్వాడి కేంద్రాల తాళాలను పగలగొట్టి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సెంటర్లు నడుపుతామనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీరికి టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు రమణమ్మ, రత్నమ్మ, భారతి, ప్రమీల, నాగేశ్వరమ్మ, రామాంజనమ్మ, హరిప్రియ, లక్ష్మీదేవి, ప్రశాంతి, సుగుణమ్మ, చౌడమ్మ, మహాలక్ష్మి, రుసింగమ్మ, సరస్వతి, రాజేశ్వరి, శివలక్ష్మి, పుష్పవతి, సాయి, రమాదేవి, ప్రసన్న, రాణీ పాల్గొన్నారు.

పుట్లూరు : అంగన్‌వాడీలు, ఆయాలు శుక్రవారం నాలుగోరోజు మండల కేంద్రంలో నల్లబ్యాడ్జి కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా తహాశీల్దార్ కార్యాలయం చేరుకుని డిప్యూటీ తహాశీల్దార్ మల్లేష్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించరు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు జయలలిత, రమాదేవి, శశికళ, అనంతలక్ష్మి, సిపిఎం మండల నాయకులు వెంకట చౌదరి, పెద్దయ్య, భాస్కర్, నాగభూషణం, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలో చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం గడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు రాధిక మాట్లాడుతూ అంగన్‌వాడీల ఆకలి బాధలు ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ప్రభుత్వం ఎంత మొండి వైఖరిగా ఉన్నా సమ్మె విరమించేది లేదనానరు. అవసరమైతే శిబిరాల్లోనే తమ ప్రాణాలు వదులుతామన్నారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు మేరి, మెహ్రూన్, రాధిక, రుద్రమ్మ, మల్లక్క, చంద్రకళ, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. కాగా మండల పరిధిలోని సిరిగేదొడ్డి, గలగల గ్రామాల్లో ఎంపిడిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల తలుపులు పగలగొట్టి స్వయం సహాయక సభ్యురాలు లక్ష్మికి విధులు అప్పగించినట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజనమ్మ తెలిపారు.

పెద్దవడుగూరు : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. వీరి దీక్షలకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా తహాశీల్దారు కార్యాలయ ఆవరణలో చేస్తున్న నిరవధిక సమ్మె దీక్షలో పాల్గొన్నారు. మద్దతు తెలిపిన వారిలో టిడిపి, జనసేన నాయకులు కొండూరు కేశవరెడ్డి, ఆవులాంపల్లి కేశవరెడ్డి, బాలిరెడ్డి, నారాయణస్వామి, బాషా, చిరంజీవులు, వెంకటరామిరెడ్డి, జనసేన నాయకులు దూద్‌వళి, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు : అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శువ్రకారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీలో నిరసన వ్యక్తంచేశారు. వీరి ఆందోళనకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు వెంకట్ నారాయణ, వెంకటేష్, పోతన్న, బాబా, కుళ్లాయప్ప, సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 4వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీలు నల్లచీరలు ధరించి నిరసన తెలిపారు. వీరికి టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో మండల టిడిపి నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, కన్వీనర్ ప్రసాద్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి సత్యవతి, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, రాధా, తిలోత్తమ, మారుతమ్మ, అలివేలమ్మ, ఈశ్వరమ్మ , కరిబసమ్మ, చంద్రకళ, 62 సెంటర్ల టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలో అంగన్వాడీలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 4వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీలు నల్లచీరలు ధరించి నిరసన తెలిపారు. వీరికి పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి బండారు కుళ్లాయప్ప, ఐఎఫ్‌టియు క్రిష్ణ, డబ్బు కళాకారుల సంఘం వ్యవస్థాపకులు ముకుందాపురం నాగరాజు, బూదేడు రామాంజనేయులు, సుబ్బన్న రాజు పాల్గొన్నారు.

అనంతపురంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

గార్లదిన్నెలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

రాయదుర్గం : అంగన్వాడీలు శుక్రవారం నల్లదుస్తులు ధరించి దీక్షా శిబిరంలో కూర్చున్నారు. స్థానిక వినాయక కూడలి నుంచి ర్యాలీగా పాత మున్సిపల్ కార్యాలయం చేరుకుని మనవహారంగా ఏర్పడి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెను అణిచివేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగులగొట్టడంపై డిప్యూటీ తహాశీ ల్దార్ సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. వీరి సమ్మెకు సిపిఐ, అనుబంధ ప్రజాసంఘాలు రైతు సంఘం, వ్య.కా.సం, మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు నాగార్జున, నాగరాజు, బండారు శివ, కోటేష్, కుళ్లాయప్ప, హనుమంతు, పార్వతి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ తాలూకా కార్యదర్శి ఆంజనేయులు సంపూర్ణ మద్దతు తెలిపి శిబిరంలో కూర్చున్నారు. దీక్షలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, రుద్రమ్మ, శోభ, ఉలిగమ్మ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్, కురువల్లి, శ్రీధరఘట్ట, ఉప్పరహాల్ అంగన్వాడీ సెంటర్లను కణేకల్లు సిడిపిఒ ఎల్లమ్మ, తహాశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ షకీల ఆదేశాల మేరకు విఆర్ఎలు చేత తాళాలు పగులగొట్టి తలుపులు తీశారు. అంగన్వాడీ సిబ్బంది నాలుగో రోజూ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, విఆర్ఎలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నామే తప్ప అంగన్వాడీ సిబ్బందితో విభేదాలు లేవని తేల్చి చెప్పారు.

బ్రహ్మసముద్రం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె నాలుగో రోజూ కొనసాగింది. విధులు బహిష్కరించి స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో నిరసన తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు ఐసిడిఎస్ సూపర్ వైజర్లు రామాంజనమ్మ, కాశింబి వచ్చి సెంటర్ల తాళాలు ఇవ్వాలని కోరినా అంగన్వాడీలు ససేమిరా అన్నారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, వరలక్ష్మి, సుజాత, అనిత, వర్కర్లు సుజాత, సంతోషమ్మ, త్రివేణి, ఎర్రమ్మ, సత్యమ్మ, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉరవకొండలో ఆందోళన

రాయదుర్గంలో అంగన్‌వాడీల మానవహారం

గుత్తిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

గుమ్మఘట్టలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

తాడిపత్రిలో మోకాళ్లపై నిరసన

జగనన్నకు చెబుదాంలో సమస్యల వెల్లువ

బెలుగుప్ప : మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలు వెల్లువలా వచ్చాయి. ఇందులో భాగంగా రెవెన్యూ 34, పంచాయతీ రాజ్ 16, హౌసింగ్ 7, పోలీస్ శాఖ సంబంధించి 9 ఫిర్యాదులు వచ్చినట్లు తహాశీల్దార్ దాసరి ఓబులేసు తెలిపారు. అలాగే బెలుగుప్ప మండలాన్ని కరువు మండల ప్రకటించాలని వైసిపి, టిడిపి, జనసేన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పందన నోడల్ ఆఫీసర్ సుధారాణి, ఆర్డీవో రాణీసుస్మిత, డిఎల్‌డిఒ శంకర్, తహాశీల్దార్ దాసరి ఓబులేష్, ఎంపిడిఒ రామచంద్రయ్య, ఎంఇఒ మల్లారెడ్డి, విద్యుత్ శాఖ ఎఇ గంగాధర్‌శెట్టి, వ్యవసాయ శాఖ ఏవో పృథ్వీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ హర్షవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, ఎస్ఐ శివ, ఆర్‌డిఒ విశ్వనాథరెడ్డి, వైద్య శాఖ అధికారి కార్తీక్‌రెడ్డి, పశువైద్యాధికారి శ్రీనివాసులు, ఎపిఎం ఆంజనేయులు, జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.గూడూరులో ఎఎస్పీ పర్యటన

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి

పుట్లూరు : మండల పరిధిలోని శనగల గూడూరు గ్రామంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఐదు నెలల క్రితం జరిగిన మొహర్రం వేడుకల్లో అగ్రవర్ణాలు, దళితుల మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎఎస్పీ గ్రామంలో పర్యటించి ఇరువర్గాల వారితో వేర్వేరు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ దిలీప్‌కుమార్, తహాశీల్దార్ మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు రివార్డులు

అనంతపురం క్రైం : బుక్కరాయసముద్రం మండలం దేవరకొండ పైనుంచి కింద పడి ఆత్మహత్యకు యత్నించి గాయాలపాలైన వ్యక్తిని కాపాడిన పోలీసులకు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శుక్రవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రివార్డులు, మెమొంటోలు అందజేశారు. అనంతపురం రూరల్ మండలం కందకూరుకు చెందిన రమేష్‌బాబు కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది గత గురువారం దేవరకొండపై నుంచి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బుక్కరాయసముద్రం బ్లూకోల్ట్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, హోంగార్డు వీరనారప్ప వెళ్లి కొండ పైభాగంలోని ముళ్ల పొదళ్లలో గాయాలతో పడిన రమేష్‌బాబును భుజాలపై కిందకు మోసుకొచి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ప్రాణాలు కాపాడిన ఇద్దరినీ ఎస్పీ సన్మానించారు.

అమరవీరులకు నివాళి

ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు, విద్యార్థులు

అనంతపురం : భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగి 52 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మాజీ సైనికులు, ఎన్‌సిసి క్యాడెట్‌లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల సిబ్బంది రంగనాథ్, బ్రుందా, చిన్న వెంకటమ్మ, జబీవుల్లా, విష్ణుప్రియ, హైస్కూల్ ఎన్‌సిసి నాగేంద్ర, పిఎస్.లక్ష్మి, అనంతరెడ్డి, బాలాజీనాయక్, మాజీ సైనికుల సంఘం తరపున జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేకన్న, కెప్టెన్ ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, నర్సింహులు, సిద్ధన్న, హుస్సేన్, ఇస్మాయిల్ షఫీ, మణికుమార్, రంగారెడ్డి, నాగిరెడ్డి, వి.శ్రీనివాసులు, హరినాథ్, ప్రభుదాస్, అబ్దుల్‌ఖాదర్, ఖాజా మొహియుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం

అనంతపురం కలెక్టరేట్ : పశ్చిమ గోదావరి జిల్లాలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న నిరవదిక సమ్మెకు మద్దతుగా హాజరై తిరుగు ప్రమాదంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీకి అంగన్‌వాడీలు, ఆశాలు సంతాపం తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద సమ్మె చేపట్టిన అంగన్‌వాడీలు, ఆశాలు, సాబ్జీ మృతి తెలియగానే సిఐటియు ఆధ్వర్యంలో సంతాపం తెలిపి మౌనం వహించారు.

రాయదుర్గం : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి చిత్రపటానికి శుక్రవారం యుటిఎఫ్ రాయదుర్గం శాఖ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ షేక్ సాబ్జి మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ రంగానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాల్ మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఎమ్మెల్సీకి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

శ్రీగురు హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన శ్రీగురు హోటల్

స్థానిక విద్యుత్ నగర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీగురు హోటల్‌ను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యాజమాన్యం గురుస్వామి మాట్లాడుతూ హోటల్ రంగంలో సుదీర్ఘకాలంగా తమకున్న అనుభవంతో సామాన్యులకు సైతం నాణ్యమైన టిఫిన్ వంటకాలను అందించడానికి గురుహోటల్ ప్రారంభించినట్లు తెలిపారు. తమకు కూరగాయల వ్యాపారంలో ఉన్న అనుభవంతో తక్కువ ధరకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, వివిధ రకాల స్నాక్స్ ఐటమ్స్ అందించడానికి ముందుకు వచ్చినట్లు వివరించారు. హోటల్‌లో సెల్ఫ్ సర్వీస్‌తోపాటు సర్వీస్ అందించేందుకు ప్రత్యేకమైన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అనంతపురంవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌భూషణ్, అబ్బా టీవీ నటులు డాక్టర్ హరిప్రసాద్, యూ టూబర్లు, పలువురు నగర ప్రముఖులు, హోటల్ యాజమాన్యం తిమ్మారెడ్డి, అశోక్, నగర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

యావజ్జీవ కారాగార శిక్ష

అనంతపురం క్రైం : ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మగట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై గాజుల ప్రభాకర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై గుమ్మఘట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కళ్యాణదుర్గం డీఎస్పీ ఎం వెంకటరమణ దర్యాప్తు చేపట్టి సాక్షులను విచారించి అనంతపురం పోక్సో కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో అనంతపురం స్పెషల్ పోక్సో కోర్టు వారు అన్ని కోణాల్లో సమగ్ర విచారించి ప్రభాకర్ నేరం చేసినట్టు నిరూపితం కావడంతో కారాగార శిక్ష విధించడంతోపాటు రూ.5 వేల జరిమాన, రూ.3 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడిని శిక్ష పడేలా చేసిన కళ్యాణదుర్గం డీఎస్పీ ఎం.వెంకటరమణ, స్పెషల్ పిపి విద్యాపతి, ప్రస్తుత కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, రాయదుర్గం రూరల్ సి.ఐ యుగంధర్, గుమ్మఘట్ట ఎస్ఐ సునీత, కోర్టు కానిస్టేబుల్ నాగార్జునను ఎస్పీ అభినందించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేం

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు, త్యాగం మరువలేనివని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చేసిన సేవలు, ప్రాణత్యాగం గురించి కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, డీసీఆర్బీ సి.ఐ విశ్వనాథచౌదరి, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ శంకర్, ఆర్ఎస్ఐ రమేష్‌నాయక్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, ఎస్పీ సి.సి ఆంజనేయప్రసాద్, ఐటి కోర్ టీం మంజు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

అనంతపురం కార్పొరేషన్ : అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దామని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నగర పాలకసంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. 56 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రం కోసం ప్రాణాలిచ్చిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, అభూ సాలెహా, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఇఇ సూర్యనారాయణ, డిఇ ద్రాక్షాయని, మేనేజర్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధకుడు పొట్టి శ్రీరాములు సమాజానికి ఆదర్శనీయులని అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధులు వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వారి చిత్రపటాలకు నేతలు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా, మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీలో నివాళులర్పిస్తున్న ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

గుత్తి : సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయి బాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, కోశాధికారి పక్రుద్దీన్, నాయకులు నారాయణరెడ్డి, విజయలక్ష్మి, గోవిందప్ప, షేక్షావలి, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ శ్రీరాములు ప్రాణత్యాగం వల్లనే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందన్నారు. అసలైన గాంధేయవాది అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వాసు, వెంకటరమేష్, శ్రీమన్నారాయణ, విశ్వనాథ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి యేసుకృపా మందిరంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నెహెమ్యా రెడ్డి వారి నాగరాజు ఆధ్వర్యంలో పాస్టర్ నవీన్ కుమార్ ప్రార్థనలు చేశారు. అనంతరం 200 మంది పాస్టర్లకు నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు రూ.2 వేల చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మేయర్ వసీం, ఉప మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం, వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, పామిడి వీరాంజనేయులు, జానర్ధన్‌రెడ్డి, ధనుంజయయాదవ్ పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

రాయదుర్గం : ఈ నెల 17వ తేదీ పట్టణంలోని జడ్పి బాలికోన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్, రూరల్ డెవలప్మెంట్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించే ఈ శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఆధార్, ఓటర్, రేషన్ కార్డు రెండు జిరాక్స్ కాపీలు, 3 ఫొటోలు, ఫోన్ నెంబర్ తీసుకురావాలన్నారు.

రేషన్ షాపుల్లో తనిఖీలు

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు జిల్లాలోని పలు చౌకధాన్యపు దుకాణాల్లో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అనంతపురం రూరల్ మండలం చిన్నకుంట, కృష్ణంరెడ్డిపల్లి గ్రామాల్లోని దుకాణాలను తనిఖీ చేసి రిజిస్టర్లు, పుస్తక నిల్వలు, భౌతిక నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శేషగిరి, వాసుప్రకాష్, ఇటుకలపల్లి విఆర్ఒ రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన పరిశీలన

పెద్దవడుగూరు : ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనను రాష్ట్ర పరిశీలకులు సీహెచ్ అబ్రహంలింకన్ శుక్రవారం పరిశీలించారు. ఈమేరకు న్యూకాలనీలోని డిపెప్ పాఠశాలతోపాటు ఐఆర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల బోధన, విద్యార్థులు ఎలా అర్థం చేసుకుంటున్నారు.. అనే విషయాలను పరిశీలించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు విరుపాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి పలుఅంశాలపై ఆరాతీశారు. ఆయన వెంట మండల విద్యాధికారులు రాముడు, గురుప్రసాద్, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, తదితరులు ఉన్నారు.

బెంగళూరు సర్వీస్ బస్సు వేళలో మార్పు

రాయదుర్గం : రాయదుర్గం నుంచి బెంగళూరు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసు బయల్దేరు వేళలు మారినట్లు స్థానిక డిపో మేనేజర్ సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకూ ఉదయం 10:30 గంటలకు బయల్దేరనున్న బెంగళూరు సర్వీస్ ఈ నెల 16వ తేదీ నుంచి ఉదయం 8 గంటలకే రాయదుర్గం నుంచి బయల్దేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని రెడ్డిపల్లి, జంతులూరు గ్రామ పంచాయతీల పరిధిలో ఎంపిడిఒ తేజ్యోష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతేకాధికారిణి శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి శ్రీదేవి, ఎంపిడిఒ తేజ్యోష్ణ, వికసిత సంకల్ప యాత్ర కో ఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, ఎంపిటిసిలు, నాగేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ యాత్రలో పాల్గొన్న అధికారులు

నిత్యావసర సరుకులు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ కాలనీల్లో నివాసం ఉంటున్న పేద కుటుంబంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి నెలకు సరిపడా 20 రకాల సరుకులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జి.రేఖాశంకర్, ఆదిలక్ష్మి, అశ్వర్థమ్మ, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు విద్యార్థులు

ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

అనంతపురం : నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు తన్మయ్, కార్తిక్ రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం ఎంపి.శ్రీనివాసులు, కరుణాకర్‌బాబు తెలిపారు. ఈమేరకు స్థానిక జూనియర్ కళాశాలలో ఎంపికైన విద్యార్థులకు డిఇఒ నాగరాజు కప్పును బహూకరించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపికయ్యేందుకు కృషి చేసిన క్రికెట్‌కోచ్ శివకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు వేగవంతం చేయండి

ఉరవకొండ : రబీ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదును వేగవంతంగా చేయాలని విడపనకల్ మండల వ్యవసాయాధికారి పెన్నయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం సిబ్బంది చేపట్టిన పంట నమోదును పరిశీలించారు. ఇందులో భాగంగా విడపనకల్లులో రైతు రామనాథరెడ్డి పొలంలో సాగు చేసిన పప్పుసెనగ పంట నమోదు చేస్తుండగా ఏవిధంగా జరుగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది ముత్యాలు, రైతులు శంకర్, నారప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి : ఎంపిపి

ఉరవకొండ : వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి ఆరోగ్య సంరక్షణకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపిపి నరసింహులు సూచించారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల పిహెచ్‌సి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివమ్మ, ఎంపిడిఒ అమృతరాజు, పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, వైసిపి నాయకులు నాగరాజు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన

ఉరవకొండ : ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రంలో ఇవిఎం, వివిప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఓటు ఎలా వేయాలో రెవెన్యూ అధికారులు చూపించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

కానిస్టేబుల్‌కు నివాళులర్పిస్తున్న పోలీసులు

అనంతపురం : అనారోగ్యంతో మృతిచెందిన తాడిపత్రి హెడ్‌కానిస్టేబుల్ ఎన్.సుంకన్నకు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతను 1983లో ఏపీఎస్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందడంతో తాడిపత్రిలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కూతురు ఉన్నారు. అంత్యక్రియల్లో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, మృతుని బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలోని తిక్కయ్య స్వామి ఆలయ ఆవరణలో మండల కేంద్రానికి చెందిన మొరుసు భాస్కర్‌రెడ్డి, బలానాగి నరేష్ మిత్రుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 70 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించనున్నట్లు వైద్యులు, నిర్వాహకులు తెలిపారు.